బీఆర్ఎస్ లీడర్‌పై కాంగ్రెస్ దాష్టీకం

- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడి
- దవాఖాన వద్ద పోలీసుల ఓవరాక్షన్
- హాస్పిటల్‌కు తీసుకెళ్తామని పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

గాయపడిన శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల మాజీ ఎంపీపీ స్వర్ణలత భర్త, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై గురువారం కొంతమంది కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. మండలంలోని రాపల్లిలో రోడ్డుపక్కన కారు నిలిపి తన బంధువుల కోసం శ్రీనివాస్ ఎదురుచూస్తుండగా, అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఒకరు కారును ఢీకొట్టాడు. దీంతో తన కాలు విరిగిందని బైకర్ శ్రీనివాస్‌తో గొడవకు దిగాడు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న తంగళ్ల రాయలింగు, తంగళ్ల సాగర్‌తోపాటు మరికొందరు శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపర్చారు. ఇది గమనించిన స్థానికులు శ్రీనివాస్‌ను వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకుని దవాఖానకు వచ్చిన పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శ్రీనివాస్‌ను ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్తామని పట్టుబట్టారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. శ్రీనివాస్‌ను ఎక్కడికి తరలించేది లేదని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా పోలీసులు శ్రీనివాస్‌ను బలవంతంగా తీసుకెళ్లారు. శ్రీనివాస్‌ను దవాఖానకు తీసుకెళ్లకుండా శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌కు, అక్కడి నుంచి హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, కుటుంబ సభ్యులు పోలీసులపై మండిపడ్డారు. చివరకు పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయగా విమర్శలు తలెత్తాయి.

పక్కా ప్లాన్‌తోనే దాడి చేశారు : స్వర్ణలత

ఘటనపై శ్రీనివాస్ భార్య, మాజీ ఎంపీపీ స్వర్ణలత మీడియాతో మాట్లాడుతూ.. పక్కా ప్లాన్‌తోనే తన భర్త శ్రీనివాస్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని ఆరోపించారు. కావాలనే కారును ఢీకొట్టి ఆ తర్వాత గంగళ్ల రాయలింగు, సాగర్‌తోపాటు పలువురు దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. కాలు విరిగిందని నాటకాలు ఆడినవారు సైతం అప్పటికప్పుడు లేచి తన భర్త పై దాడి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పిన పోలీసులు స్టేషన్‌కు ఎందుకు తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీనివాస్‌కు ఏం జరిగినా పోలీసులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

● ఫార్మాకు భూములివ్వం.. పోరాటం ఆపం..

విషపూరితమైన ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని ఫార్మా భూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలెపల్లిలో తాండూర్ సబ్ కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఫార్మా కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఫార్మా కంపెనీ ఏర్పాటును 20 మంది రైతులు వ్యతిరేకిస్తూ తమ భూములు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించామని, కానీ ఈ విధంగా వినాశనానికి ఒడికడతారని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. – కొడంగల్

● పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. –సిరిసిల్ల టౌన్

● స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. –హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్

● ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాల్సిందే..

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్(బీసీ ఏవైఎఫ్)ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం ముట్టడికి యత్నించారు. దీంతో ఓయూలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పోలీసులు విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు రూ.7,600 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – ఉస్మానియా యూనివర్సిటీ

శ్రీశైలం ఎండీడీఎల్ 854 అడుగులే

- బచావత్ అవార్డుల ప్రకారమే నీటి పంపకాలు
- జూరాలలో 46 టీఎంసీలకు మించి వాడొద్దు
- ట్రిబ్యునల్ ఎదుట ఏపీ సర్కారు వాదనలు

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం డ్యామ్ నుంచి ఎప్పుడంటే అప్పుడు జలవిద్యుత్తును ఉత్పత్తి చేయడం కుదరదని, దిగువన నాగార్జునసాగర్‌లో తాగు, సాగునీటి అవసరాలు ఉన్నప్పుడు మాత్రమే ఇన్సిడెంటల్‌గా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట వాదించింది. గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలు పూర్తిగా తమకే దక్కుతాయని పేర్కొన్నది. కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ మధ్య పునఃపంపిణీ చేయడంతోపాటు ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం గత అక్టోబర్‌లో మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ట్రిబ్యునల్ ఎదుట ఏపీ సర్కార్ శుక్రవారం అఫిడవిట్ దాఖలు చేసింది. అందులో ప్రధానంగా శ్రీశైలం ఎండీడీఎల్‌ను 854 అడుగులుగా నిర్ధారించాలని కోరింది.

వినతిపత్రంతో వస్తే.. ముఖం చాటేసిన సీతక్క

- పట్టించుకోకుండా కాన్వాయ్‌లో వెళ్లిపోయిన మంత్రి
- దళితబంధు అర్హులకు చేదు అనుభవం
- దూరం నుంచి వస్తే సమస్య వినరా అంటూ ఆగ్రహం
- కలెక్టర్ ఖాతాలో మా నిధులు మురిగిపోతున్నయ్
- 10 నెలలు అవుతున్నా జమ కాలేదంటూ ఫైర్

మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇచ్చేందుకు ఎదురుచూస్తున్న బాధితులు

హైదరాబాద్ సిటీ బ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : దళిత బంధు పథకం అమలు చేయాలంటూ హుజూర్‌నగర్, ములుగు, పరకాల, హుజూరాబాద్, సూర్యాపేట నుంచి సుమారు 200 మంది లబ్ధిదారులు ప్రజాభవన్‌కు తరలివచ్చి మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇవ్వాలని చూడగా ఆమె పట్టించుకోకుండా వెళ్లిపోయారు. బాధితులు మంత్రి కాన్వాయ్ వెంట పరుగెత్తినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ దళితబంధు అందించాలని కోరుతూ దళితబంధు సాధనసమితి ఆధ్వర్యంలో 200 మంది శుక్రవారం ప్రజాభవన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో మంత్రి సీతక్క 'మూసీ' బాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉన్నారు. మంత్రిని కలిసి వినతిపత్రం అందిస్తామని సమితి నాయకులు సిబ్బందికి వివరించారు. చెక్కుల పంపిణీ ముగిశాక మంత్రి సీతక్క బయటకు రాగా బాధితులందరినీ పోలీసులు చుట్టుముట్టారు. ఎవరైనా ఇద్దరికి మంత్రిని కలిసే అవకాశం ఇస్తామని.. వినతిపత్రం అందించాలని అధికారులు సూచించారు. అంగీకరించిన డీబీఎస్ఎస్ నాయకులు మంత్రిని కలిసేందుకు సిద్ధమయ్యారు. ఈ లోపు మంత్రి కాన్వాయ్‌లో ఎక్కేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎదురుగా పరుగెత్తినా కూడా ఆమె పట్టించుకోకుండా వెళ్లిపోవడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసాలకు ఓర్చి వస్తే కనీసం తమ బాధ వినరా? అని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సెర్ప్ సీఈవో దివ్యరాజన్‌కు డీబీఎస్ఎస్ అధ్యక్షుడు కే మహేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. 200 మంది వివిధ నియోజకవర్గాల నుంచి ఇక్కడికి వస్తే మంత్రిని కలిసే అవకాశం దక్కలేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బంధు అర్హులందరికీ అందేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

కేజీబీవీ విద్యార్థిని మృతి

- టైఫాయిడ్‌తో చికిత్స పొందుతూ కన్నుమూత
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న తండ్రి
- కలెక్టర్‌కు ఫిర్యాదు

స్వాతి (ఫైల్)

రంగారెడ్డి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): అనారోగ్యం బారినపడి కస్తూర్బా గాంధీ హాస్టల్ విద్యార్థిని మృతి చెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని చెప్పకుండా హాస్టల్ సిబ్బంది దసరా సెలవుల్లో ఇంటికి పంపించి చేతులు దులుపుకున్నారని విద్యార్థిని తండ్రి ఆరోపిస్తున్నారు. తన కూతురు చనిపోవడానికి హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ రంగారెడ్డి కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరుకు చెందిన కొంగర స్వాతి(17) శంషాబాద్ మండలం పాలమాకులలోని కేజీబీవీ బాలికల హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. దసరా సెలవులకు ఇంటికి తీసుకెళ్లాలంటూ సెప్టెంబర్ 30న స్వాతి తండ్రి రమేశ్‌కు హాస్టల్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో అక్టోబర్ 1న స్వాతిని ఇంటికి తీసుకొచ్చారు.నీరసంతో ఉన్న స్వాతిని విషయం అడగగా..కొద్ది రోజులుగా ఇలాగే ఉంటోందని చెప్పింది. దీంతో షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా టైఫాయిడ్ వచ్చినట్టు వైద్యులు చెప్పగా మూడు రోజులు చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ కూడా జ్వరం నయం కాకపోవడంతో గాంధీ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తుండగానే..బ్రెయిన్ డెడ్ అయి మరణించిందని వైద్యులు పేర్కొన్నారు. తన కూతురు మరణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రమేశ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

గురుకులం భవనం పై నుంచి దూకిన విద్యార్థిని

చేర్యాల, అక్టోబర్ 18 : సిద్దిపేట జిల్లా చేర్యాలలో బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల) భవనం పైనుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. 7వ తరగతి విద్యార్థిని శుక్రవారం రాత్రి మొదటి అంతస్థు ఎక్కి భవనం వెనుక భాగం నుంచి కిందికి దూకింది. గాయాలపాలైన ఆమెను వెంటనే చేర్యాల ప్రభుత్వ ద వాఖానకు తరలించారు. పరిస్థితి విషమం గా ఉండడంతో సిద్దిపేట దవాఖానలో చికి త్స చేయిస్తున్నారు. ప్రిన్సిపాల్‌ను నమస్తే తెలంగాణ ఫోన్‌లో ప్రశ్నించగా.. తాను సెలవులో ఉన్నానని, ఘటనపై టీచర్లు తనకు ఫోన్ చేసి చెప్పారని, విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉందని సమాధానం ఇచ్చారు.

కులగణనకు మద్దతివ్వండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బీసీ సంఘాల వినతి

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతున్న కులగణనకు బీజేపీ మద్దతివ్వాలని బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ నేతలు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చి పక్రియను ప్రారంభించిందని తెలిపారు. 20న నిర్వహించబోయే అఖిలపక్ష సమావేశంలో పాల్గొనాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

నేడు లా కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): బీసీ, ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని పలు లా కాలేజీల్లో సీట్ల భర్తీకి శనివారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆయా సొసైటీల కార్యదర్శులు సైదులు, వర్షిణి ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం బాలుర లా కాలేజీలో 47 సీట్లు, హనుమకొండ జిల్లా కాజీపేట బీసీ గురుకుల వుమెన్ లా కాలేజీలో 39సీట్లు, సరూర్‌నగర్ లా కాలేజీలో 29సీట్లు అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. లాసెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఆయా కళాశాలల్లో నేడు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని వెల్లడించారు. వివరాలకు 93966 00601, 99083 44469 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్ ఎన్నికల్లో పోటీ చేశారా?

- అప్పీలులో జాప్యంపై సాకులు చెప్పవద్దు
- భూ వివాదంలో అధికారుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు వ్యక్తులతో తలెత్తిన ఓ భూవివాదంలో సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వం తీరుబడిగా అప్పీల్ దాఖలు చేయడమే కాకుండా చట్టసభల ఎన్నికల వల్ల కౌంటర్ దాఖలులో జాప్యం జరిగిందని సాకులు చెప్పడంపై హైకోర్టు నిప్పులు చెరిగింది. ఎన్నికల వల్ల ఆలస్యంగా అప్పీల్ దాఖలు చేశామని చెప్పడానికి మీరేమైనా రాజకీయ నాయకులా? అని అధికారులను ప్రశ్నించింది. ఎన్నికలు రాజకీయ నాయకులకు సంబంధించిన వ్యవహారమని పేర్కొంటూ.. ఈ అప్పీలు దాఖలు చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఏ రాజకీయ పార్టీ తరపున పోటీ చేశారని నిలదీసింది. హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని 2,302 చదరపు గజాల స్థలానికి సంబంధించిన వివాదంపై 2016లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రభుత్వం తరపున కలెక్టర్ ఈ ఏడాది జూలైలో అప్పీలు దాఖలు చేయడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస రావు ధర్మాసనం పై ప్రశ్నలను సంధించింది. 2023లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినందున అప్పీలు దాఖలు చేయలేకపోయామని సాకులు చెప్పడం సరికాదని స్పష్టం చేసింది. అనంతరం ఈ అప్పీలు దాఖలులో జాప్యానికి దారితీసిన కారణాలను తెలియజేస్తూ సవివరమైన అఫిడవిట్ దాఖలు చేస్తామని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పడంతో అందుకు అనుమతించిన హైకోర్టు.. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

'పాలమూరు-రంగారెడ్డి' ఎప్పుడు పూర్తి చేస్తరు?

- పనులు త్వరగా పూర్తి చేసి కాల్వల ద్వారా నీరందించాలి
- లేదంటే డిసెంబర్ 7న నిరసన దీక్ష : నాగం జనార్దన్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 18: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్లను ఎప్పుడు పూర్తి చేస్తారు? వాటి నుంచి రైతులకు ఎప్పుడు నీరందిస్తారు? అని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. త్వరగా ప్రాజెక్టుల పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని, లేకుంటే డిసెంబర్ 7న నిరసన దీక్ష చేపడతానని నాగం హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు క్యాలెండర్ ప్రకారం 7వ తేదీలోపు పనులు పూర్తి చేసి కాల్వల ద్వారా నీటిని పారించాలని, లేదంటే తాను రిజర్వాయర్ వద్ద నిరసన దీక్ష చేపడుతానని స్పష్టంచేశారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్లను పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక ఉందా లేదా అని ప్రశ్నించారు. రిజర్వాయర్లలో మోటర్లను బిగించడం పూర్తయినా కాల్వలకు నీటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. తన హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రస్తుతం రైతులకు వరంగా మారిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా రైతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా ఎంపికైన ప్రొఫెసర్ పురుషోత్తమ్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు సన్మానం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా ఎంపికైన ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ బృందం శుక్రవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా వంగపల్లి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడిగా, దళిత మేధావిగా, ఆర్థికవేత్తగా సమాజానికి అనేక సేవలందించిన పురుషోత్తంకు ఈ పదవి దక్కడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లేశ్, చిలకమర్తి గణేశ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారంటూ అంగన్‌వాడీ సిబ్బందిని నిలదీసిన ఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామలో జరిగింది. ఆలుగామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలింతలకు కోడి గుడ్లను పంపిణీ చేశారు. వాటిని శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఉడకబెడుతుండగా దుర్వాసన రావడంతో అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకువచ్చి సిబ్బందిని ప్రశ్నించారు. గుడ్లను పగులగొట్టడంతో దుర్వాసన రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీడీపీవో మనోరమను వివరణ కోరగా కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలోనూ పిన్నారం, ఎసన్పాయి గ్రామాల్లోనూ కుళ్లిన గుడ్లు పంపిణీ చేసిన ఘటనలు జరిగాయి. – కోటపల్లి

● డిజిటల్ క్రాప్ సర్వే చేయలేం

డిజిటల్ క్రాప్ సర్వే చేయలేమని ఏఈవోలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి పెదపల్లి డీఏఓ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. డిజిటల్ సర్వే చేయలేమని డీఏఓ ఆదిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ.. ఇప్పటికే వ్యవసాయశాఖలోని 49 రకాల పనులు చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వేకు సహాయకులను నియమించాలని, లేకుంటే మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో చేస్తున్న సర్వేలా ఇక్కడా చేయాలని డిమాండ్ చేశారు. – పెద్దపల్లి

బీబీనగర్ ఎయిమ్స్‌లో కామకేళి

సోషల్ మీడియాలో వీడియో వైరల్

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (నమస్తేతెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో కామకేళి బాగోతం బయటకు వచ్చింది. ఇటీవల ఘటన జరగ్గా.. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో శుక్రవారం చక్కర్లు కొట్టింది. భువనగిరి పట్టణానికి చెందిన ఓ మహిళకు ప్లేట్‌లెట్లు తగ్గడంతో ఈ నెల 10న అర్ధరాత్రి బీబీనగర్ ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆమె బంధువులు బిల్డింగ్ బయట నిరీక్షించారు. అయితే.. పైన ఓ రూమ్‌లో స్త్రీ, పురుషుడు రాసలీలల్లో తేలిపోయారు. రూమ్ అద్దాలు పూర్తిగా తీసి ఉండటంతో అసభ్యకర దృశ్యాలు బయటకు స్పష్టంగా కనిపించాయి. దాంతో అక్కడ ఉన్నవాళ్లంతా ఒక్కసారిగా నోరెళ్లబెట్టారు. ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఆ సమయంలో అక్కడున్న సెక్యూరిటీ గార్డు వీడియో ఎందుకు తీస్తున్నావంటూ అడ్డుతగిలే ప్రయత్నం చేస్తూ.. ఇదంతా సహజమేనంటూ నిర్లక్ష్యంగా చెప్పుకొచ్చాడు. కొందరు వైద్య విద్యార్థులు కిందకొచ్చి.. సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన వీడియో డిలీట్ చేసి, క్షమాపణలు చెప్పాలని హెచ్చరించినట్టు తెలిసింది. దాంతో కొందరు రోగి బంధువులు ఎదురు తిరగడంతో వారు తిరిగి వెళ్లిపోయినట్టు సమాచారం. ఇదే విషయంపై ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాతోపాటు అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

సీఎం ఫొటో పెట్టలేదని తహసీల్దార్లకు నోటీసులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఘటన

మోర్తాడ్, అక్టోబర్ 18: అధికారిక కార్యక్రమాల్లో సీఎం ఫొటోలు పెట్టలేదని నలుగురు తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం నిజామాబాద్ జిల్లాలో చర్చనీయాంశమైంది. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇటీవల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ జరిగింది. అధికారికంగా నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో సీఎం ఫొటో పెట్టలేదని ఫిర్యాదు రావడంతో కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, బాల్కొండ తహసీల్దార్లకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెల 9న కమ్మర్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ, మోర్తాడ్ మండలాల్లో, 10న ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండలాల్లో చెక్కుల పంపిణీ కార్యక్రమాలను తహసీల్దార్లు ఏర్పాటు చేయగా.. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో సీఎం ఫొటో లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా స్పందించి ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం ఫొటో పెట్టాలని సూచించారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, బాల్కొండ తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

త్వరలో ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్

- ఇప్పటికే 140 బస్సుల్లో ప్రయోగాత్మకంగా చెల్లింపులు
- మరో 2 నెలల్లో నగరంలోని అన్ని డిపోల్లో అమలు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేసేవారికి ఎదురయ్యే ప్రధాన సమస్య చిల్లర సమస్యకు చెక్ పెట్టేందుకు త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు ఆర్టీసీ యాజమాన్యం రెడీ అయింది. ఇందుకు సంబంధించి బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోల్లోని 140 బస్సుల్లో ఇప్పటికే డిజిటల్ చెల్లింపులను ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ సేవలకు విశేష స్పందన రావడంతో మరో రెండు నెలల్లో గ్రేటర్ పరిధిలోని అన్ని డిపోల్లో డిజిటల్ చెల్లింపుల విధానం అమల్లోకి తీసుకురానున్నారు. ప్రయాణికులు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో పాటు క్రెడిట్, డెబిట్ కార్డు స్వైపింగ్‌తో టికెట్ కొనే వెసులుబాటు అ